క్లుప్తంగా

'విద్యార్థులను ప్రోత్సహించండి'

యాచారం: ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివే పేద విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయ జాతీయ అవార్డు గ్రహిత లిక్కి అనురుద్రరెడ్డి పేర్కొన్నారు. చింతపట్ల గ్రామంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అంబేడ్కర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు తెలివితేటలున్నా, ఆర్థిక పరిస్థితుల వల్ల వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థులను చేరదీసి ఆర్థికంగా సహాయం చేస్తే మంచి మార్కులు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆర్ కృష్ణ, చంద్రయ్య, రమేశ్, కృష్ణ, శివ, వంశీ, అరుణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్



హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం రావుల పూజ ఫణీంద్రగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ఫల, పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, హోమ పూజలు, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన శ్రీనివాస్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, కేశవులు, నర్సింహాగౌడ్, రాజుగౌడ్, ఫలనీశ్‌గౌడ్, సుగంధ్‌గౌడ్, శ్రీనివాస్, ప్రభావతి జైన్, లక్ష్మమ్మ, కరుణశ్రీ, ఉమాదేవి, యాదగిరిగౌడ్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ ఆలయంలో పూజలు



పూజలో కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను శనివారం మధ్యాహ్నం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, జిల్లా పరిషత్ చైర్మన్ బాలాజీసింగ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, సూదినిరాంరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇందిరాశోభన్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహా

యాచారం: భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని యాచారం మండల అధ్యక్షుడు మస్కు నర్సింహా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపే లక్ష్యంగా చేతిగుర్తుపై ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రతి గ్రామంలో అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసే వారికి భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మొండిగౌరెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బడె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాజుల కోసమే హత్య

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలైన నిందితుడు
- వృద్ధురాలిని చంపి.. బంగారు గాజులు చోరీ
- హత్య కేసును ఛేదించిన ఆదిబట్ల పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



నిందితుడిని మీడియాకు చూపుతున్న డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇటీవల జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలైన తెలిసిన వ్యక్తే.. ఆమె చేతికి ఉన్న బంగారు గాజులను దొంగిలించేందుకు ఈ దురాగతానికి పాల్పడ్డాడు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి, మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి శనివారం మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గడ్డం కళావతి(76) అనే ఓ వృద్ధురాలు నాదర్‌గుల్‌లోని తమ వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటోంది. కొడుకులు, బిడ్డలు వారానికోసారి వచ్చి చూసి వెళ్తుంటారు. ఇదిలా ఉండగా ఈనెల 18న కళావతి తన గదిలో మృతిచెంది ఉన్నట్లు స్థానికంగా ఉండే వారు గుర్తించారు. అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు మృతిపై అనుమానం వ్యక్తంచేయడంతో కేసు నమోదు చేసుకున్న ఆదిబట్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా మృతికి ముందు రోజు స్కూటీపై ఓ వ్యక్తి వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. వాహనం నంబర్ ఆధారంగా కేసును ఛేదించారు. కొంపల్లిలో ఉండే కళావతి చిన్నకూతురు రజిని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసే రత్న అశోక్‌రెడ్డి హత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. 17న రాత్రి 10 గంటల వరకు అశోక్‌రెడ్డి వృద్ధురాలి వద్దే ఉన్నాడు. చుట్టూ ఎవరూ లేరని గమనించి ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు లాక్కునేందుకు ప్రయత్నించడంతో ప్రతిఘటించింది. ఈ క్రమంలో హంతకుడు ఆమెను బలంగా నెట్టడంతో పక్కనే ఉన్న మంచంపై పడిపోయింది. ఆవెంటనే వృద్ధురాలి ముఖంపై దుప్పటి వేసి చేతులతో గొంతు నొక్కాడు. చనిపోయిందని డిసైడైన తర్వాత చేతికి ఉన్న ఆరు బంగారు గాజులు తీసుకుని స్కూటీపై పారిపోయాడు.

అప్పుల పాలై.. హత్య చేసి

ఏడెనిమిది నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్న నిందితుడు పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్నాడు. పలు లోన్ యాప్‌ల ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. యాక్సిస్ బ్యాంకులో రూ.1.10 లక్షల లోన్ తీసుకుని ఆన్‌లైన్ జూదంలో పోగొట్టుకున్నాడు. లోన్లు చెల్లించే మార్గం లేకపోవడంతో వృద్ధురాలిని టార్గెట్‌గా చేసుకున్నాడు. ఆమె నుంచి దొంగిలించిన బంగారు గాజులను అమీర్‌పేట్‌లోని బెనకా గోల్డ్ కంపెనీలో అమ్మేసి రూ..3.96 లక్షలు తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌లలో పోగొట్టాడు. పూర్తి సాక్ష్యాధారాలు సేకరించిన అనంతరం శనివారం అశోక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడు వాడిన వాహనం, సెల్‌ఫోన్, వృద్ధురాలిని చంపడానికి వినియోగించిన దుప్పటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజు, సిబ్బంది సందీప్, శివచంద్రకు డీసీపీ సునీతారెడ్డి రివార్డులు అందజేసి అభినందించారు.

యువతి వివాహానికి సాయం

ఆమనగల్లు: మేడిగడ్డ తండాకు చెందిన సబావత్ వాలీ, అంజ్యా నాయక్‌ల కుమార్తె శిరిష వివాహానికి మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్ శనివారం క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌రాథోడ్, రాజ్‌కుమార్, రవీందర్, బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు ఆమనగల్లు మండలం నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్, సయ్యద్‌ఖలీల్, జహంగీర్, కిరణ్, శివ, ప్రసాద్, రంజిత్, వడ్డె వెంకటేశ్, ఆనంద్, యాదగిరి తదితరులు తరలి వెళ్లారు.

ఎండలో ఉపాధి పనులు చేయొద్దు

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



గడ్డమల్లయ్యగూడలో ఉపాధి పనుల కొలతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పనులు చేసుకోవాలని, ఎండలో చేయొద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల గ్రామాల్లో శనివారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు చేసే ఉపాధి పనులు కొలతల ప్రకారం ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు. నింబంధనల ప్రకారం ఉపాధి పనులు చేస్తేనే కూలి గిట్టుబాటవుతుందని చెప్పారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు తమతమ ఆరోగ్యాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రతిరోజూ సరిపడా తాగునీరు వెంట తీసుకెళ్లాలన్నారు. ఈజీఎస్ సిబ్బంది కూడా ఉపాధి కూలీల ఆరోగ్యంపై సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి:

మంచాల: గ్రామాల్లో కూలీలు సమయ పాలన పాటించాలని పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంచాల మండలంలోని తాళ్లపల్లి గూడ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. కొలతల ఆధారంగానే కూలి చెల్లిస్తారన్నారు. కష్టపడి పని చేసే వారు ప్రభుత్వం కల్పించే ప్రతీ అవకాశం సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ గ్రామంలో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీడీఓ బాల శంకర్, ఏపీడీ సక్రియా నాయక్, ఏపీఓ వీరాంజనేయులు, ఈసీ విమల, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా 'నారాయణుడి' కల్యాణం

- ఘనంగా స్వామివార్లకు పల్లకీ సేవా
- హాజరైన భక్త జనం



కల్యాణంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాసురెడ్డి



పూజలో శ్రీనివాసురెడ్డి, లక్ష్మమ్మ దంపతులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. బాజా, భజంత్రీలు, మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. కల్యాణ దాతలు కాసు లక్ష్మీదేవి, శ్రీనివాసురెడ్డి దంపతులు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను దేవతామూర్తులకు అలంకరించి ముస్తాబు చేశారు. వేద పండితులు నరసింహ్మయ్య, కామేశ్వరమూర్తి, శ్రీనివాసామూర్తి శర్మలు వేద మంత్రాలు చదువుతుండగా ముత్యాల తలంబ్రాలతో లక్ష్మీనారాయణస్వామిలకు మంగళసూత్రం ధారణ గావించారు. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. లక్ష్మీనారాయణస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్‌రెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి విశిష్ట అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వేద పండితులు వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. హైదరాబాద్, షాద్‌నగర్, శంషాబాద్, కల్వకుర్తి, అచ్చంపేట్, సంగారెడ్డి, తదితర పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయంలో అర్చకులు మండప పూజలు, యజ్ఞహోమాలు, సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ, రాత్రి అఖండ భజనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, దోకూరి సునీత, ప్రభాకర్‌రెడ్డి, గోసుల సౌమ్య, శేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజన్‌రెడ్డి, సలహాదారులు శ్రీనివాసామూర్తి, రఘుమారెడ్డి, జగన్, దశరథం, అడ్వకేట్ శ్రీనివాసులు, అంజి, భక్తులు, పాల్గొన్నారు.

విరాళం అందజేత

వెంకటాపూర్ గ్రామంలో లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం సందర్భంగా శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి, లక్ష్మమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణానికి రూ. లక్ష విరాళం అందజేశారు.

అబద్ధపు హామీలను నమ్మొద్దు

- తొలిదశ ఉద్యమం నుంచి నేటి వరకూ మోసపోయాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- 'పట్నం'లో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఇబ్రహీంపట్నం రూరల్: జెండా ఎగురవేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గుప్పిస్తున్న అబద్ధపు హామీలను నమ్మొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమం నుంచి నేటి వరకు కాంగ్రెస్ హయాంలో రాష్ట్రానికి అడుగడుగునా మోసమే జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్‌కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగరవేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తొలిదశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 369 మంది ఉద్యమ కారులను కాల్చిచంపిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. పెద్ద మనుషుల ఒప్పందం, ఫజల్‌అలీ కమిషన్ సిఫార్సులు, 610 జీవోల అమలుచేయకుండా కాంగ్రెస్సే మోసం చేసిందన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఉద్యమం చేసి 14 సంవత్సరాలు మడమ తిప్పని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ ఉద్యమాన్ని నీరుగార్చడానికి కాంగ్రెస్ ఎన్నో కుట్రలు పన్నిందని, ఉద్యమ పార్టీని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని వివరించారు. కాంగ్రెస్ కుట్రలను ఛేదించి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేండ్లలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి, రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, ఎంపీపీ కృపేశ్, యాచారం జెడ్పీటీసీ జంగమ్మ, మండల అధ్యక్షుడు బుగ్గరాములు, కిషన్‌గౌడ్, రమేశ్, రమేష్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు కొప్పు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల కేంద్రంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్ నాయక్, చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సుగుణ సాయిలు, హరిచంద్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి

కేసు నమోదు

తలకొండపల్లి: బెల్టు షాపుపై శనివారం పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన నరేందర్‌గౌడ్ కిరాణా షాపుపై పక్కా సమాచారం మేరకు దాడి చేయడంతో అక్కడ 14 బీర్లు లభ్యమయ్యాయి. దీంతో నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

తలకొండపల్లి: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రాంపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాదు రవీందర్‌రెడ్డి (60) ఉదయం 10 గంటల ప్రాంతంలో పొలం పొలం పనులకు వెళ్లాడు. సొప్ప కోస్తుండగా పాము కాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చి చూచేసరికి కాలుపై రెండు గాట్లు గుర్తించారు. పాము కాటు వేయడంతో రవీందర్‌రెడ్డి తల్లడిల్లి కొట్టుకున్నారని, దీంతో మోచేయి కండరాలు ఎర్రగా కంది పోయి ఉన్నాయన్నారు. మృతుడికి భార్య అనసూయ, నలుగురు సంతానం.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నర్సింహారావు

యాచారం: గ్రామాల్లో ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహారావు విజ్ఞప్తి చేశారు. నక్కర్తమేడిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం కేంద్ర పోలీస్ బలగాలతో కవాత్ నిర్వహించారు.

ఓటు సద్వినియోగం చేసుకోండి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం ఓటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మహిళా సంఘాల్లోని సభ్యులంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు అన్నింట్లో ముందు ఉండాలని చెప్పారు. అందుకే ఓటుహక్కు అనేది మన బాధ్యతగా భావించాలని సూచించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను తరిమికొట్టాలి



మాట్లాడుతున్న మల్లురవి పక్కన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను తరిమికొట్టాలని నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి అభ్యర్థి డాక్టర్ మల్లురవి పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి అత్యధిక స్థానాలు గెలిపించి, సీఎం రేవంత్‌కు ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు వద్ద డీఎంకె ఫంక్షన్‌హాల్లో శనివారం ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, కల్వకుర్తి కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి ఇందిరాశోభన్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని ఆయన ఆరోపించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కల్వకుర్తి కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రోజుకు 18 గంటలు ప్రజల మధ్యే ఉంటున్నానని, ప్రజల కష్టసుఖాలలో పాలపంచుకుంటున్నానని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీలు కమ్లి మోత్యానాయక్, అనిత, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడురి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, బిచ్యానాయక్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, ఆకుతోటపల్లి ఎంపీటీసీ నిట్టి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: మల్లురవి, కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన లక్పతినాయక్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

ఆమనగల్లు /కడ్తాల్: ఆమనగల్లు, కడ్తాల్ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డా మల్లురవి సమక్షంలో పార్టీలో చేరారు. రాంనుంతల గేటు సమీపంలోని డీఎంకె ఫంక్షన్ హాల్లో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కడ్తాల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్పతినాయక్ తన అనుచరులు, ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు జంతకు శ్రీశైలం ఆధ్వర్యంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కసిరెడ్డి, మల్లు రవిలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లి మోత్యానాయక్, అనిత, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడురి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు యాటనర్సింహా, కడ్తాల్, ఆమనగల్లు అధ్యక్షుడు బిచ్యానాయక్, జగన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టండి



మాడ్గుల శిక్షణ కార్యక్రమంలో బలరామకృష్ణ, సురేశ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్స్

- ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ
- కో ఆర్డినేటర్ సురేశ్ కుమార్

మాడ్గుల: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, కోఆర్డినేటర్ సురేశ్ కుమార్‌లు పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండో రోజు కూడా సూపర్ వైజర్లు జయమ్మ, పద్మలతో జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ, సురేశ్ కుమార్‌లు మాట్లాడుతూ నేటి సమాజం కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్ జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్లు వాడేవారు ఎవరైనా దీనికి గురయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. ముఖ్యంగా యువతులు మొబైల్ ఫోన్లో రకరకాల యాప్‌ల ద్వారా లైంగిక వ్యాపారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రవాణాపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు, నిరాక్ష్యరాస్యత కూడా అక్రమ రవాణాకు కారణమని అభిప్రాయ పడ్డారు. దీనికి సినిమా హీరోయిన్లు, రాజకీయ నాయకులు కూడా గురవుతున్నారన్నారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

యాచారం: గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన ప్రకారం.. మాల్ కేంద్రంలో నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మదనాపూర్ గ్రామానికి చెందిన శివ వద్ద రూ.9,500 విలువైన మద్యం, గునుగల్ గ్రామంలో మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన రాజు వద్ద రూ.7వేల విలువైన మద్యం, తాడిపర్తి గ్రామంలో వెంకటమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4వేల విలువైన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.